జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 7 | మే | 2025 ◆ పేజీలు : 4



## ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తి చేయాలి..

- పది ఎకరాలకు ఒక ఫామ్ పాండ్ తప్పనిసరి..
- ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా త్వరితగతిన రూపొందించాలి...
- టెలి కాన్ఫరెన్స్ లో అధికారులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 6, ప్రజాజ్యోతి :** జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు అన్నింటిలో ఇంకుడు గుంతల నిర్మాణాలు వారంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో పురోగతిలో ఉన్న ఇంకుడు గుంతల నిర్మాణం, పామ్ పౌండ్స్ మిగతా 2 లో...

- సింగరేణి ఉద్యోగి పై ఏసీబీ దాడులు
- ముఠాగా ఏర్పడి కొందరు అవినీతికి పాల్పడుతున్నట్టు గుర్తించిన అధికారులు
- వందల ఫైళ్లు, 50 లక్షల రూపాయలు లావాదేవీలతో పట్టుపడ్డ అన్నబోయిన రాజేశ్వరరావు
- ఇతను కేవలం ముఠా సభ్యుడనే సమాచారం
- అసలు సూత్రధారీ ఓ డిస్మిస్ కార్మికుడని తెలుస్తోంది
- న్యాయవాది ముసుగులో ఈ కార్యకలాపాలని చక్కదిద్దుతున్న వైనం
- మెడికల్ బోర్డు, ట్రాన్స్ఫర్, ఉద్యోగాల పేరిట లక్షల్లో వసూళ్లు..
- ఎసిబి విచారణలో మరికొన్ని నిబ్బరపోయే నిజాలు..?
- ఈ అక్రమ సంపతుడి చిట్టా.. ప్రజాజ్యోతిలో ప్రత్యేక కథనాలు




## పాత్రధారి పట్టుబడే... మరీ

# సూత్రధారి సంగతేంటి..?



2 లో..

సింగరేణిలో మెడికల్ బోర్డు ను అడ్డుపెట్టుకుని అమాయకుల నుంచి డబ్బు వసూలు చేయడం, బదిలీలు, ఇంటర్నల్ ఉద్యోగాల్లో మోసాలు, పోస్టింగ్ లు, డిప్యూటేషన్లు, క్వార్టర్ కేటాయింపులు, అక్రమ సంపాదన, బ్లాక్ మెయిలింగ్ పేరిట అక్రమాలకు పాల్పడుతున్న మూట లో పాత్రధారుడిగా ఉన్న వ్యక్తి ఏసీబీ అధికారులకు దొరికాడు. మరి అసలు సూత్రదారుడిగా చలామణి అవుతున్న ఆ "సంపతుని" సంగతేంటి అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

◆ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి




## నక్సలిజాన్ని వీడుతున్న మావోలు

- 14 మంది మావోయిస్టులు లొంగుబాటు
- లొంగిపోయిన మావోలకు 25 వేలు ఆర్థిక సహాయం
- విలేకర్ల సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజ్

**కొత్తగూడెం క్రైమ్, మే 6 , ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 14 మంది సభ్యులు లొంగిపోవడం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వివరించారు. వివిధ క్యాడర్ లో పనిచేస్తున్న 14 మంది సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోవడం జరిగిందని పేర్కొన్నారు. నక్సలిజం లో కాలం చెల్లిన సిద్ధాంతాలకు స్వస్తి పలికి కొంతమంది సభ్యులు లొంగిపోయేందుకు ముందుకు వస్తున్నారని వివరించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుండి అందే సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. లొంగిపోయిన వారికి తక్షణమే 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం ఇవ్వడం జరుగుతుందని, వారి భవిష్యత్ ఉపాధి కొరకు దశలవారీ ఆర్థిక సాయం ప్రభుత్వం

మిగతా 2 లో...

## ఏసిబి వలలో సింగరేణి ఉద్యోగి

**కొత్తగూడెం (సింగరేణి) మే 6, (ప్రజాజ్యోతి):** మంగళవారం జరిపిన ఏసీబీ దాడులలో సింగరేణి మెయిన్ వర్క్ షాప్ డ్రైవర్ అన్న బోయిన రాజేశ్వరరావు ను అధికారులు అదుపులో తీసుకున్నారు. సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తానని, మెడికల్ అన్ ఫిట్ చేయిస్తానని, బదిలీలు చేయిస్తానని 50 లక్షల రూపాయల వసూళ్లకు పాల్పడినట్టు సమాచారం. ఆయనతోపాటు మరో బృందంగా ఏర్పడి అక్రమాలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. ఈ మూటలో ప్రధానంగా గతంలో సంస్థ ఉద్యోగిగా ఉంటూ అనేక అవకతవకలకు పాల్పడి డిస్మిస్ కు గురైన ఓ ఉద్యోగి ప్రముఖ పాత్ర వహిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అవినీతి ఆరోపణలతో ఉద్యోగం పోగొట్టుకున్న ఆయన ప్రస్తుతానికి న్యాయవాదిగా అవతారం ఎత్తి మరిన్ని అక్రమ పనులకు పూనుకుంటున్నాడు. ఈ నేపథ్యంలోనే సంస్థలోని కొందరి ఉద్యోగులను అనుచరులుగా పెట్టుకొని అక్రమాలకు తెర లేపినట్టు పలువురు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలో దిగిన అవినీతి నిరోధక శాఖ అధికారులు పక్క ఆధారాలతో రాజేశ్వరరావు ను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో మరి కొంతమంది పేర్లు తెరపైకి వచ్చే అవకాశం ఉంది.



## అక్రమంగా తరలిస్తున్న లారీ రేషన్ బియ్యం పట్టివేత

- కొత్తగూడెం వన్ టౌన్ పోలీసుల తనిఖీలు..
- 687 బస్తాలలో 343 క్వింటాల పి.డి.ఎస్ బియ్యం స్వాధీనం..
- వీటి విలువ రు.12,36,600 లక్షలు..
- అదుపులో నలుగురు వ్యక్తులు..మరో నలుగురు పరారీ..




- వివరాలు వెల్లడించిన కొత్తగూడెం వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం . కరుణాకర్..

**కొత్తగూడెం, మే 6, ప్రజాజ్యోతి :** పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నుంచి ఛత్తీస్గఢ్ రాష్ట్రానికి వెళ్తున్న లోడ్ రేషన్ బియ్యం లారీని

మిగతా 2 లో...

## ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తి చేయాలి..

(మొదటి పేజీ తరువాయి...)
నిర్మాణాలు ,ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా ల పై అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, తహసిల్దార్ లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతీ సెక్రటరీలు , సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలు తదితర అన్ని కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు నిర్మాణాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. ప్రతి ఎకరానికి ఐదు ఇంకుడు గుంతలు అర ఎకరానికి మూడు ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఉండే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైతే వర్షం నీరు నిలువ ఉంటాయో గుర్తించి అటువంటి చోట ఎక్కువ ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. వర్షాకాలంలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టేలా ఇంకుడు గుంతల నిర్మాణాలు ఉండాలన్నారు. అయినా ఇంకుడు గుంతల నిర్మాణాలను లను పంచాయతీ సెక్రటరీలు జల్ సెంచెయ్ జెన్ భాగీ దారి పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. జెల్ సంచెయ్ జన్ భాగీదారి లో దేశంలోనే మొదటి స్థానంలో జిల్లాను నిలపాలని అధికారులను ఆదేశించారు. వచ్చేవారం నుండి వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలోని వ్యవసాయానికి యోగ్యమైన భూముల్లో నీటి కుంటల నిర్మాణానికి మార్కింగ్ పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడున్నర లక్షల ఎకరాల సాగు భూమి ఉన్నదని దానిలో పదో వంతు 34 వేల నీటి కుంటలు త్రవ్వకాలు చేపట్టాలని, 10 ఎకరాలకు ఒక నీటి కుంట తప్పనిసరిగా ఉండాల్సిందే అని కలెక్టర్ చెప్పారు. ఉపాధి హామీ సిబ్బంది , వ్యవసాయ అధికారులు సమన్వయంతో నీటికుంటలకు మార్కింగ్ పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా నీటి కుంటల నిర్మాణం చేపడతామని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా నీటి కుంటల ఆవశ్యకత పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీటి కుంటలో నిర్మించడం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని చేపల పెంపకం చేపట్టవచ్చని తెలియజేయాలన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా మునగ సాగు గురించి అవగాహన కల్పించాలన్నారు. మునగ సాగు చేసి విజయం సాధించిన రైతుల గురించి చెప్పాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా రూపకల్పన ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు సంతకం చేసిన జాబితాను ప్రతిరోజు వార్డు, గ్రామ, మండల స్థాయి నివేదికలను అందించాలన్నారు. పూర్తి అయిన జాబితాలను ఇన్చార్జి మంత్రి అనుమతి కొరకు ప్రతిరోజు పంపించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## నక్సలిజాన్ని వీడుతున్న మావోలు

(మొదటి పేజీ తరువాయి...)
తరఫున చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. తెలంగాణ పోలీస్ శాఖ లొంగిపోయిన మావోయిస్టు సభ్యులకు అందిస్తున్న పునరావాస సౌకర్యాలకు ఆకర్షితులై వివిధ క్యాడర్ లో పనిచేస్తున్న వారంతా తమ ఆయుధాలను విడిచిపెట్టి పోలీసుల ఎదుట లొంగిపోతున్నట్లు వివరించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 257 మంది వివిధ హోదాల్లో ఉన్న మావోయిస్టు సభ్యులు లొంగిపోయినట్లు తెలిపారు. గత కొంతకాలంగా సీపీఐ మావోయిస్టు పార్టీ ఆదివాసీ ప్రజల్లో ఆదరణ, నమ్మకం కోల్పోయి కాలం చెల్లిన సిద్ధాంతం తో పాటుగా ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటూ ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే తమకు మనుగడ ఉండదని భావించి, అమాయకపు ఆదివాసీ ప్రజలు జీవనం సాగించడానికి నిత్యం సంచరించే ప్రదేశాలలో మందు పాతర్లను అమర్చుతూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. మావోయిస్టు పార్టీ నాయకుల దుశ్చర్యలతో ఆదివాసీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతూ చాలా ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. కొంతమంది అమాయక ఆదివాసీలను పోలీస్ ఇన్ఫార్మర్ల పేరుతో చంపడం, హింసించడం జరుగుతుందన్నారు. మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న సభ్యులు స్వచ్ఛందంగా పోలీసుల ఎదుట లొంగిపోయి వారి కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీస్ తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. లొంగిపోయిన సభ్యులకు పునరావాసం, జీవనోపాధి కల్పించడం కోసం తెలంగాణ ప్రభుత్వం తరఫున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, విలేకర్ల సమావేశంలో ఎస్పీ. రోహిత్ రాజు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పోలీస్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

- సింగరేణి ఉద్యోగి పై ఏసీబీ దాడులు
- ముఠాగా ఏర్పడి కొందరు అవినీతికి పాల్పడుతున్నట్టు గుర్తించిన అధికారులు
- వందల ఫైళ్లు, 50 లక్షల రూపాయలు లావాదేవీలతో పట్టుపడ్డ అన్నబోయిన రాజేశ్వరరావు
- ఇతను కేవలం ముఠా సభ్యుడనే సమాచారం
- అసలు సూత్రధారీ ఓ డిస్మిస్ కార్మికుడని తెలుస్తోంది
- న్యాయవాది ముసుగులో ఈ కార్యకలాపాలని చక్కదిద్దుతున్న వైనం
- మెడికల్ బోర్డు, ట్రాన్స్ఫర్, ఉద్యోగాల పేరిట లక్షల్లో వసూళ్లు..
- ఎసిబి విచారణలో మరికొన్ని నిబ్బరపోయే నిజాలు..?
- ఈ అక్రమ సంపతుడి చిట్టా.. ప్రజాజ్యోతిలో ప్రత్యేక కథనాలు



# పాత్రధారి పట్టుబడే... మరి సూత్రధారి సంగతేంటి..?



**సింగరేణిలో మెడికల్ బోర్డు ను అడ్డుపెట్టుకుని అమాయకుల నుంచి డబ్బు వసూలు చేయడం, బదిలీలు, ఇంటర్నల్ ఉద్యోగాల్లో మోసాలు, పోస్టింగ్ లు, డిప్యూటేషన్లు, క్వార్టర్ కేటాయింపులు, అక్రమ సంపాదన, బ్లాక్ మెయిలింగ్ పేరిట అక్రమాలకు పాల్పడుతున్న మూట లో పాత్రధారుడిగా ఉన్న వ్యక్తి ఏసీబీ అధికారులకు దొరికాడు. మరి అసలు సూత్రదారుడిగా చలామణి అవుతున్న ఆ "సంపతుని" సంగతేంటి అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.**

◆ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

కొత్తగూడెం కేంద్రంగా మంగళవారం జరిగిన ఏసీబీ దాడులలో సింగరేణి ఎన్సిడబ్ల్యూఏ ఉద్యోగి అన్నబోయిన రాజేశ్వరరావు (వర్క్ షాప్ డ్రైవర్) పక్క ఆధారాలతో అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికాడు. సుమారు 50 లక్షల రూపాయల లావాదేవీలు, వందల సంఖ్యలో ఫైల్స్ అతని దగ్గర లభ్యమైనట్టు అధికారులు తెలిపారు. అయితే ఇవన్నీ ఇప్పటివరకు అంచనా మాత్రమే ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని ఆ అధికారులు మీడియా ముఖంగా తెలిపారు. అయితే ఇంతటి భారీ అవినీతి బాగోతం వెనక ఆ ఉద్యోగి ఒక్కడే కాదు.. మరి కొంతమంది బృందంగా ఏర్పడి ఈ పనులు చక్కబడుతున్నారని అధికారిక అంచనాలో వెల్లడైంది. దీంతో ఇప్పుడు అనుమానాలన్నీ ఒకే ఒక వ్యక్తి వైపు వేలెత్తి చూపుతోంది. అతనే మాజీ సింగరేణి ఉద్యోగి, ప్రస్తుతం న్యాయవాది ముసుగులో చలామణి అవుతున్న.. అక్రమ సంపన్నుడు , అవినీతి కోపిష్టుడైన సంపతుడు.

### కొందరి వల్లే అప్రతిష్టపాలు..

136 సంవత్సరాలు ఘనచరిత్ర కలిగిన సింగరేణి ప్రపంచ స్థాయిలోఎంతో ప్రఖ్యాతిగాంచింది. కానీ కొందరి తీరువల్ల అప్రతిష్టపాలు కూడా అవుతుంది. అందులో ప్రముఖుడు, ప్రథముడు ఇప్పుడు ఏసీబీ దాడిలో దొరికిన ముఠా నాయకుడు. లక్షల మంది కార్మికులు రక్తాన్ని చెమటగా మలచి , భూగర్భం నుంచి బొగ్గు ఉత్పత్తులు సాధిస్తూ.. దేశానికి వెలుగులు నింపుతున్నారు. అలాంటి శ్రమజీవులను మభ్యపెడుతూ.. ఈ ముఠా అక్రమ సంపాదనకు తెరలేపింది. అమాయక కార్మికులను మోసం చేస్తూ, కంపెనీ ప్రతిష్టను దిగజారుస్తూ.. ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు ఈ అవినీతి తిమింగలాలు. వీరి సంఖ్య చాలా తక్కువే అయినప్పటికీ.. సిరుల మాగాణి మహావృక్షానికి పట్టిన చీడపురుగులుగా, కార్మికుల రక్త మాంసాలు తాగే జలగలుగా రాజ్యమేలుతున్నారు.

### ముఠా నాయకుడి చిట్టా...

మంగళవారం నాడు ఏసిబి దాడులలో చిక్కిన ముఠా నాయకుడి చిట్టా చాటబారతమంతా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇతను గతంలో సింగరేణి ఉద్యోగిగా ఉంటూ అనేక అక్రమాలు, అవకతవకలకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఇలాంటి అనేక అవినీతి కేసులతోనే సంస్థ ఉద్యోగం నుండి డిస్మిస్ అయిన ఇతను తన వక్రబుద్ధిని మాత్రం మార్చుకోలేదని సన్నిహితులు ఆరోపిస్తున్నారు. సంస్థ ఉద్యోగులను కొన్ని ప్రలోభాలకు గురి చేస్తూ.. అక్రమ సంపాదనకు బీజం పోసినట్టు అధికారికంగా ప్రచారంలో ఉంది. ఈ నేపథ్యంలోనే సంస్థ వ్యాప్తంగా కొందరిని అనుచరులుగా పెట్టుకొని ఈ అక్రమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాడు. ఇప్పటికే కోట్ల రూపాయల అక్రమ ధనార్జనతో అందరినీ భయభ్రాంతులకు గురి చేస్తున్న ఈ ముఠా నాయకుడి చిట్టా.. ప్రజాజ్యోతిలో ప్రత్యేక వరుస కథనాలు.

## అక్రమంగా తరలిస్తున్న లారీ రేషన్ బియ్యం పట్టివేత

(మొదటి పేజీ తరువాయి...)
వాహన తనిఖీల్లో గుర్తించి అదుపులోకి తీసుకొని స్వాధీనం చేసుకున్న సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం. కరుణాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాధారణ వాహన తనిఖీల్లో భాగంగా కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్.ఐ.సి కార్యాలయ ప్రాంతంలో వన్ టౌన్ ఎస్సై జి.విజయ కుమారి తన సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సి.జి 04 పి.ఎక్స్ 0717 (సి . జి.04 పి.ఎక్స్ 0717) నెంబర్ గల ఓ కంపెనీకి చెందిన లారీ అనుమాన స్పందనంగా రోడ్డు పై వెళుతూ కనిపించింది. ఇది గమనించిన ఎస్సై ఆ లారీని ఆపివేసి అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ లారీలో నలుగురు వ్యక్తులతో పాటు 687 బస్తాలలో సుమారు 343 క్వింటాల పి.డి.ఎస్ రైస్ అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. అక్రమంగా తరలిస్తున్న పి.డి.ఎస్ బియ్యం లారీతో పాటు నలుగురు నిందితులను వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ పి.డి.ఎస్ బియ్యాన్ని పొరుగు తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన పి.డి.ఎస్ బియ్యాన్ని ప్రజల వద్ద నుంచి కే.జీ రు.12 చొప్పున కొనుగోలు చేసి చత్తీస్గడ్ ఇతర రాష్ట్రాలకు ఒక కే.జీకి రూ.20 చొప్పున అమ్ముకునేందుకు వెళ్తున్నట్లు బహిర్గతమైందని సీ.ఐ తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ సుమారు రు.12,36,600 లక్షలు ఉంటుందని వివరాలు వెల్లడించారు. నిందితులు నలుగురిపై కేసు నమోదు చేసి, పరారైన మరో నలుగురి కోసం దర్యాప్తు వేగంగా చేస్తున్నట్లు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ తెలిపారు. అదుపులో తీసుకొని కేసు నమోదు చేసిన వారిలో.. చప్పిడి వెంకటకృష్ణ, చల్లంగుల రామ్మోహన్ రావు, భువనేశ్వర సాహూ, చిత్తరంజన్ తారక్, తదితరులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పరారీలో ఉన్న మరో నలుగురు వ్యక్తులపై దర్యాప్తు చేస్తున్నారు. మొత్తం ఎనిమిది మందిపై కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యాయి. చాకచక్యంగా వ్యవహరించి లోడు బియ్యం లారీని పట్టుకున్నందుకు వన్ టౌన్ పోలీస్ సిబ్బందిని కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్, భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

# అక్రమంగా వలస వచ్చిన వారిపై చర్యలు తీసుకొని, జిల్లా నుండి సాగానంపండి



**కొత్తగూడెం మున్సిపాలిటీ, మే 6, ప్రజా జ్యోతి :** కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్రమంగా ఉంటున్న ఇతర దేశ ప్రజలు, పాకిస్థాన్, బంగ్లాదేశ్ ,రోహింగ్యాలను గుర్తించి తిరిగి వారి దేశాలకు పంపించాల్సిందిగా జిల్లా ఎస్ పి కి బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు న్న నిర్ణయం మేరకు భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలో ఉన్న ఇతర దేశస్తులను గుర్తించి వెంటనే వారి వారి ప్రాంతాలకు పంపించి దేశ రక్షణకు తోడ్పాటు ఇవ్వాలని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలో ప్రతి పౌరుడు స్పందించి ప్రభుత్వ అధికారులకు, పోలీసు వారికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పైడిపాటి రవీందర్,జిల్లా జనరల్ సెక్రెటరీ చింతల చెరువు శ్రీను, రాష్ట ఎస్సీ మోర్చా నాయకులు రంజిత్, కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ శీలం విద్యాసాగర్, పాల్వంచ టౌన్ ప్రెసిడెంట్ రాపాక రమేష్, రూరల్ అధ్యక్షుడు క్రాంతి, లక్ష్మీదేవి పల్లి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్, బిజెపి సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి గోపి, కృష్ణారెడ్డి, గుంపుల మహేష్, సతీష్, జిల్లా నాయకులు గౌడుగు శ్రీధర్ యాదవ్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ గా అన్నపురెడ్డిపల్లి వాసి



**అన్నపురెడ్డిపల్లి, మే 6, ప్రజా జ్యోతి :** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల అన్నపురెడ్డిపల్లి నివాసి, ప్రస్తుతం గవర్నమెంట్ తెలుగు లెక్చరర్ గా పనిచేస్తున్న పరస వెంకటేశ్వర్లు ను ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ తమ సర్టిఫైడ్ ట్రైనర్ గా గుర్తిస్తూ సర్టిఫికెట్ జారీ చేసింది. విద్యార్థుల్లో కెరీర్ గైడెన్స్, యువతలో పర్సనాలిటీ మేనేజ్మెంట్, లైఫ్ స్కిల్స్, వయోజనుల్లో వృత్తిపరమైన, వ్యక్తిగతమైన సమస్యలను ఆటంకాలను అధిగమించడానికి వీరి సేవలను వినియోగించుకునేటట్లు అర్హత కల్పించింది. నెల రోజులపాటు పైన చెప్పిన అంశాలలో శిక్షణ ఇచ్చి 98% స్కిల్ గుర్తించామని పేర్కొంటూ నిన్న ఖమ్మంలో జరిగిన రీజియన్ త్రీ ట్రైనర్స్ క్యాంపులో అవార్డు ప్రధానం చేయడం జరిగింది. వివిధ సంస్థలు, వ్యక్తులు వీరి సేవలను ఉపయోగించుకొని ఉత్తమ జాతీయ వాదులుగా స్కిల్డ్ పర్సన్స్ గా పెంపొందాలని కోరుకున్నారు.

# డిప్యూటీ తహసిల్దార్ కు బిజెపి ఆధ్వర్యంలో వినతిపత్రం



**టేకులపల్లి,మే06,ప్రజాజ్యోతి :** భారత దేశ వ్యాప్తంగా అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ రోహింగ్య ముస్లిం వారిని గుర్తించి వారిని వెంటనే వారి స్వదేశాలకు పంపించాలి అని డిప్యూటీ తహసిల్దార్ కుబిజెపి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గత నెల ఏప్రిల్ లో పహల్గం లో భారతీయులపై జరిగిన మారణకాండ పై ప్రత్యేక దృష్టి సారించిన కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ రోహింగ్య ముస్లింలను దేశం నుండి వారి స్వదేశాలకు వెళ్లవలసినదిగా ఆదేశించింది. అటువంటి వారెవరైనా మన దేశ లో గాని, మండలంలో నివసించి వునట్లయితే భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందునా, వెంటనే స్పందించి అటువంటి వారిని వారి స్వదేశాలకు పంపించాలని బిజెపి నాయకులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో మండల బిజెపి మండల అధ్యక్షుడు శంభు నాయక్ , చిక్క వెంకటేశ్వర్లు,మంగ్య నాయక్. ప్రబారి పుణ్యానాయక్, మండల యువ మోర్చా అధ్యక్షుడు వినోద్ కుమార్,వెంకటేశ్వర్లు. జమాల్. అప్పారావు. మండల మహిళా అధ్యక్షురాలు గంగా. తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్య హుండీ ఆదాయం రూ.1.76 కోట్లు




**భద్రాచలం ,మే 6,ప్రజాజ్యోతి :**భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంకు రూ.1,76,00,347 హుండీ ఆదాయం వచ్చింది. మంగళ వారం ఆలయ ఆవరణలోని చిత్రకూట మండపంలో ఆలయ హుండీలను తెరిచి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. ఇందులో రూ.1,76,00,347 నగదు. 115 గ్రాముల, బంగారం, 1390 గ్రాముల వెండి లభించింది. కాగా ఆలయ హుం డీలను చివరిగా మార్చి 20న లెక్కింపు నిర్వహించగా, 47 రోజుల అనంతరం లెక్కింపు నిర్వహించారు.

# భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం కల్చరల్ , మే 6(ప్రజాజ్యోతి ) :** భద్రాచలం దివ్యక్షేత్రంలోని బేడా మండపంలో అర్చకులు గురువారం స్వామివారికి నిత్యకల్నార్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణ, నిత్యపూజలు జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంజన్నకు అభిషేకం.. రామయ్యకు కల్యాణం



**భద్రాచలం కల్చరల్ , మే 6(ప్రజాజ్యోతి ) :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలో ఉన్న దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో మంగళవారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యకమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అర్హులైన నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం

- **సిబిల్ స్కోర్ ద్వారా అర్హత జాబితా**



**పాల్వంచ(రూరల్), మే 06, ప్రజా జ్యోతి :** పాల్వంచ మండలం నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయనున్నదని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. 1 యూనిట్ కి 50వేల నుండి 4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనుందని పేర్కొన్నారు. ఏప్రిల్. 14. 2025 నాటికి గడువు ముగియగా అన్ని వర్గాల నుండి 2008 దరఖాస్తులు రావడం జరిగిందని, ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ క్షేత్రస్థాయిలో కొనసాగుతుందన్నా రు. మంగళవారం నాడు పాల్వంచ మండలం 9 మంది బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లుతో రాజీవ్ యువ వికాసం ఉపాధి యూనిట్లు అవకాశాలను సిబిల్ స్కోర్ ద్వారా అర్హత జాబితాను తయారు చేయుట జరుగుతుందన్నా రు. అర్హులైన అభ్యర్థులు నిరుద్యోగ యువతి, యువకులకు రాజీవ్ యువ వికాసం ద్వారా లబ్ధి పొందనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. కావున దళారులను నమ్మి మోసపోవద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో (ల్ డి యం) శ్రీనివాస్ రెడ్డి ,మండల పంచాయతీ అధికారి బొగ్గ నారాయణ (ఏపి యం), ఎన్.రాంబాబు, (ఏ వో )శంభో శంకర్. మండల స్థాయి అధికారులు బ్యాంకు మేనేజర్లు & ఫీల్డ్ ఆఫీసర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలను, సమాజాన్ని తప్పుదోవ పట్టించడం సరికాదు : టిపిటిఎఫ్

- **ముఖ్యమంత్రి మాటలు ఆపేక్షనీయం!**
- **ఉద్యోగులు తెలంగాణ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి వ్యతిరేకం కాదు**

**భద్రాచలం టౌన్, మే 6, ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం మీడియాలో రాష్ట్ర ఆత్మగౌరవాన్ని కించపరిచేలా, తెలంగాణ ప్రజలను ఢిల్లీలో దొంగలుగా చూస్తున్నారని, ఉద్యోగులు ప్రజల అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే విధంగా వాఖ్యలు చేయడాన్ని టీపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తున్నదని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు అన్నారు. ఉద్యోగులు తెలంగాణ అభివృద్ధికి, సంక్షేమానికి వ్యతిరేకం కాదని, ప్రజలు పాలకులకు అధికారాన్ని అప్పగించింది. ప్రజలందరీ బాగోగుల కోసమేనని, ఉద్యోగులు కూడా ప్రజలలో భాగమేననే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుంచుకోవాలని అన్నారు. స్థానిక టీపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన డివిజన్ స్థాయి కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగులు జి.పి.ఎఫ్, టిఎస్జిఎల్ఐ లలో తాము దాచిపెట్టుకున్న సొమ్మును ప్రభుత్వం తిరిగి ఇవ్వకుండా సంవత్సరాలుగా పెండిగ్ లో ఉంచడం, ముప్పై సంవత్సరాల పైబడి ప్రభుత్వ ఉద్యోగిగా ప్రభుత్వానికి సేవలు అందించి రిటైర్డ్ అయిన పెన్షనరీ ప్రయోజనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తే, ప్రభుత్వం ఉద్యోగులు బోనస్ ఇవ్వాలని ఉద్యమాలు చేస్తున్నారని ప్రజలను, సమాజాన్ని తప్పుదోవ పట్టించే విధంగా ముఖ్యమంత్రి అసత్యాలను మాట్లాడడం శోచనీయమని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలనే డిమాండ్లుగా చేసుకొని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తున్నవని, ప్రభుత్వం గత పదిహేను నెలలుగా అనేక మార్లు ఉద్యోగ జె.ఎ.సి.తో చర్చలు జరిపి పరిష్కరిస్తామని చెప్పి, ఇప్పటివరకు ఉద్యోగులకు మొండి చేయి చూపెడుతూ వంచిస్తున్నదని, ఉద్యోగ జె.ఎ.సి. ప్రభుత్వం ముందు పెట్టిన 57 డిమాండ్లలో సుమారు 40 డిమాండ్లు ఆర్థికేతర సమస్యలని, వీటి పరిష్కారానికి ప్రభుత్వం వేసిన మంత్రుల ఉప కమిటీ అనేది పేరుకే మిగిలిపోయిందని, కాలయాపన చేయడానికకేనని అర్థమైందన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యులు మునిగడప రామాచారి మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా దివాళ తీయడానికి ప్రభుత్వ పాలకులే బాధ్యత వహించాలని, పాలకులు అడ్వర్టైజ్మెంట్స్ పేర్ల మీద, హెలికాప్టర్ల ప్రయాణాల మీద పెడుతున్న అడ్డగోలు ఖర్చులను తగ్గించి ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచకుండా సామాన్య, మధ్యతరగతి ఉద్యోగుల హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు. ఉద్యోగులను బెధిరించి, ప్రజలకు ఉద్యోగులకు మధ్య చిచ్చుపెట్టి, తన బాధ్యతల నుండి తప్పించుకొనే ప్రయత్నంలో భాగంగానే ముఖ్యమంత్రి ఉద్యోగులపై అసంబద్ధ వాఖ్యలు చేశారని, ఉద్యోగులుగా న్యాయపరంగా రావాల్సిన హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ ప్రజల సంక్షేమానికి నిలబడతామని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమస్యలను చర్చించాలని అన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి,మే06, ప్రజాజ్యోతి:**ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళ వారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది.ఆశా కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సూచనలు సలహాలు పాటిస్తూ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్య తెలంగాణ ఏర్పాటుకు కృషి చేయాలని అమ్మాయికి 21 సంవత్సరాలు అబ్బాయికి 25 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహానికి వెళ్లాలని సరైన వయసులో వివాహం జరిపించడం వల్ల ఆరోగ్యంగా ఉండడమే కాకుండా ఆ కుటుంబం ఆర్థికంగా నిలబడుతుందని వారు అన్నారు. బాల్యవివాహాలను అరికట్టాలని వైద్య సిబ్బందిని వారు కోరారు.ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖప్రసవాల సంఖ్యను పెంచాలని సీజనల్ వ్యాధులను అరికట్టడంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు అలాగే ఆశా కార్యకర్తల కష్టం నాకు తెలుసని వారి సమస్యలపై నాకు పూర్తి అవగాహన ఉందని వారికి పూర్తి న్యాయం చేయడానికి వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలకు హామీని ఇచ్చారు .ఈ సందర్భంగా వైద్యాధికారి మండలంలోని 12 ఆరోగ్య ఉప కేంద్రాలకు మౌలిక వసతులను కల్పించాలని ఎమ్మెల్యే కి వినతి పత్రం సమర్పించడం జరిగింది .ఈ కార్యక్ర మంలో వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్, డాక్టర్ కంచర్ల వెంకటేష్ ,డాక్టర్ విజయ శ్రీ ,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతీ, ఆరోగ్య విస్తరణాధికారి దేవా , ఇల్లందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, సూపర్వైజర్లు పోరండ్ల శ్రీనివాస్ నాగు బండి వెంకటేశ్వర్లు, గుజ్జా విజయ, కౌసల్య సింగ్ వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టుకి డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ ఏర్పాటు చేయాలి లేకుంటే ఉద్యమం తప్పదు

- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్




**కొత్తగూడెం కలెక్టరేట్, మే 6, ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసిన సీతారామ ప్రాజెక్టుకి డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ కి నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాల ని లేకుంటే జిల్లా వ్యాప్త ఉద్యమాన్ని చేపట్టాల్సి ఉం టుందని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు హెచ్చరించారు. మంగళవారం పాల్వంచ మండల పరిధిలోని జగన్నాధపురం ముంతాజ్ ఫంక్షన్ హాల్ నందు ఎలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన జరిగిన జిల్లా వర్క్ షాప్ లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 19 కోట్లతో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భూములు నష్టపోయి కాలువలు తీశారని అయినా జిల్లాకి నీరు ఇవ్వటానికి కావలసిన డిస్ట్రిబ్యూటర్ కెనాల్స్ నిర్మాణం చేపట్టకపోతే జిల్లా ఎండిపోయే అవకాశం ఉందని ఆయన అన్నారు . జిల్లా నుండి నీరు పోతున్నా జిల్లాకు చుక్క నీరు లేకపోతే జిల్లా ప్రజలు చూస్తూ ఊరుకోవాలా అని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు . జిల్లాకి అన్యాయం జరుగు తుంటే తెలంగాణ రైతు సంఘం చూస్తూ ఊరుకోదని దీనిపై ఈ నెల 20వ తేదీ వరకు గ్రామ గ్రామాన సభలు పెట్టి ప్రజలను చైతన్యం చేస్తామని, ఈ నెల 30వ తేదీ వరకు మండల స్థాయి ధర్నాలు నిర్వహించి, అనంతరం జాతాలు నిర్వహించి, జిల్లా కలెక్టర్ కార్యాలయం దిగ్బందిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ జిల్లాలో ప్రాజెక్టుకి భూములు ఇచ్చిన మిగిలిన భూములకి సబ్ కాలువలు ఏర్పాటు చేసి జిల్లాలో మొదటి డిజైన్ ప్రకారం మూడున్నర లక్షలు ఎకరాలు అవసరం ఉందని ఆయన అన్నారు. కానీ ప్రభు త్వం డిజైన్ మార్చి 2 లక్షల కుదించిందని ఆ రెండు లక్షల కూడా నేడు నీళ్లు వచ్చే అవకాశం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇదేవి ధంగా వ్యవహరిస్తే జిల్లా రైతాం గాన్ని కూడా అధికారాంతరంగాన్ని దిగ్బం దించే వరకు పోరాటానికి కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారా యణ, నాయకులు కున్సా ధర్మ , దొడ్డ లక్ష్మీ నారాయణ, కొండ పోయిన వెంక టేశ్వర్లు, రవికుమార్, సత్యనారాయణ, కేశవరావు, తిరుపతిరావు, శ్రీకాంత్, శంకర్, వెంకటేశ్వర్లు, వినోద్, శ్రీనివాసరావు, వెంకట్రావు, రామారావు, శంకరయ్య, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# రోళ్లపాడులో ఎమ్మెల్యే పర్యటన..





- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు.!
- అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు

**టేకులపల్లి, మే 06, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం రోళ్లపాడు గ్రామంలో స్థానిక ఎమ్మెల్యేకోరం కనకయ్య మంగళవారం పర్యటిస్తూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయినా వారి వద్దకు వెళ్లి పాత ఇంటిని పరిశీలించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి విడతలో ఇండ్లు రానివారు నిరాశ చెందవద్దని అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇండ్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని వారు హామీ ఇచ్చారు. లబ్దిదారులు అధికారులు ఇచ్చినటువంటి నమూనా ప్రకారం ఇండ్లు నిర్మాణం ప్రారంభించాలని 400 చదరపు అడుగులు తగ్గకుండ 600 చదరపు అడుగులు మించకుండా ఇండ్లు నిర్మించుకోవాలని వారు సూచించారు.త్వరలో శంకుస్థాపన కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ఎంపిక అయినటువంటి అర్హులైన లబ్దిదారుల ప్రతీ ఇంటిని సందర్శించి పథకాన్ని దుర్వినియోగం చేయకుండ పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేయాలనీ ఇందిరమ్మ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే తగు సూచనలను చేసారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ ,ఇంచార్జి ఎంపీడీవో గాంధీ , మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్,శివ, ఊళ్ళోజు ఉదయ్,సర్దార్, బొడ్డు అశోక్, స్థానిక పంచాయతీ సెక్రటరీ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## యాదవ విద్యావంతుల శిక్షణా తరగతులు జయప్రదం చేయండి



**భద్రాచలం టౌన్, మే 6(ప్రజాజ్యోతి ):**భద్రాచలంలో నేడు జరిగే యాదవ విద్యావంతుల శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జెట్టి రామకృష్ణ యాదవ్, కాటిబోయిన ఆనందు్కమార్లు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో జరిగే సమావేశంలో యాదవ విద్యార్థులు, యువత పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేకల మల్లిబాబు యాదవ్, కుమ్మరికుంట సాంబశివరావు, బొల్లి శేఖర్, గోనె సుధాకర్ పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మె ను జయప్రదం చేయాలి - సీఐటీయూ

**టేకులపల్లి,మే06,ప్రజాజ్యోతి:** కేంద్రంలో అధికారం లో ఉన్న బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఆకులంగా ఉన్నదని కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదని దానికి అందులో భాగంగా 4లేబర్ కోడ్ లను తెచ్చిన దానికి వ్యతిరేకంగా మే 20వ తేది జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పీ హెచ్ సీ డాక్టర్ కి సమ్మె నోటీసు ను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ నబి,వీరన్న,వజ్జ సుశీల, సుగుణ, చంద్రకళ,మజహరి,విజయ, హైమావతి, తాళ్లూరి కృష్ణ,రమణ, విజయ, మల్లీశ్వరి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు .



# ఏజెన్సీ ప్రాంతాలలో అక్రమ రియల్ ఎస్టేట్, లే అవుట్లు పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

- సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్

**చుంచుపల్లి,మే06,ప్రజాజ్యోతి:** మండల కేంద్రంలో సేవాలాల్ సేన సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ పాల్గొన్నారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏజెన్సీ ప్రాంత హక్కులను ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ గారిని కోరారు.జిల్లా వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏజెన్సీ ప్రాంతాలలో ఆక్రమ వెంచర్లు వేసి గిరిజనులు ఒక్క ఫ్లాట్ కొనుగోలు చేయకుండా వ్యాపారం చేసుకోకుండా 95% తమ ఆధీనంలో తీసుకున్న బడాబాబులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భవిష్యత్తులో కూడా గిరిజన ప్రజలు ఒక్క ఫ్లాట్ కొనకుండా చేస్తున్నారని అన్నారు భవిష్యత్తులో వారి అవసరాలకు తగ్గట్టుగా ఇండ్లు నిర్మాణం కొరకు జానెడు జాగ లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెచ్చిపోతు వ్యాపార కేంద్ర బిందువుగా లక్ష్మీదేవి పల్లి మండలం చుంచుపల్లి మండలం పాల్వంచ మండలం సుజాతనగర్ మండలం జూలూరుపాడు మండలం భద్రాచలం మండలలు ఉండడంతో చుట్టుప్రక్కల గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుండి కూడా పలువురు ఇక్కడ ఫ్లాటు భూములు కొనుక్కుంటున్నారు కమర్షియల్ ప్రాంతాలు కావడంతో ఫ్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడు పోతున్నాయి అయితే ఇలాంటి పరిస్థితులు వస్తే గిరిజన ప్రజల మనుగడ ప్రశ్నార్థకం అయ్యే అవకాశాలు ఉండడంతో అప్పట్లో గిరిజన ప్రజల కోసం ప్రత్యేక చట్టాలు ప్రత్యేక పాలన నియమాలను చేర్చారు. కానీ బడా బాబుల ధనం ముందు ఇవన్నీ పనిచేయడం లేదు దర్జాగా రోజుకో వెంచర్ ఏజెన్సీ ప్రాంతాలలో పుట్టుకొస్తున్నాయి ఇప్పటికే ఆయా మండలాలలో జిల్లా కేంద్రం పరిసర ప్రాంతాలలో సామాన్యుడు ఒక గజం భూమి కొనలేని పరిస్థితి ఏర్పడుతూ వస్తుంది ఏజెన్సీ ప్రాంతాలలో ఏజెన్సీ చట్టాలను కాపాడాల్సిన అధికారులు వారి పరిధిలో ఏజెన్సీ చట్టాలకు తోట్లు పొడుస్తున్నపట్టించుకోని పరిస్థితి ఈ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నెలకొంది అక్రమంగా ఏర్పాటు చేసుకున్న వెంచర్లకు గ్రామపంచాయతీల నుండి ఇంటి నెంబర్లు విద్యుత్ కనెక్షన్ కొరకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లను పంచాయతీ కార్యదర్శులు ఇస్తూ గిరిజన చట్టాలను తూట్లు పొడుస్తున్నారు అని అన్నారు అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాలలో అక్రమ వెంచర్లకు గిరిజనేతరులకు 1/70 యాక్ట్ పీసా చట్టాల ప్రకారం విద్యుత్ కలెక్షన్ ఇవ్వకూడదు అనే నిబంధనలు ఉన్నప్పటికీ ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ అక్రమ వెంచర్లకు విద్యుత్ కనెక్షన్లు విద్యుత్ శాఖల నుండి అధికారులు ఇస్తున్నారు ఇలా ఏజెన్సీ ప్రాంతాలలో అక్రమ వెంచర్లలు ఏర్పాటు చేసుకున్నా వారి భూములను ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాలలో ఆక్రమ వెంచర్లకు సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు జిల్లాస్థాయి అధికారులు తీసుకోవాలని లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు జిల్లా ఉపాధ్యక్షులు బోడ రమేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి లాలునాయక్, సహాయ కార్యదర్శి భూక్య రమేష్‌నాయక్, కిషన్ నాయక్ పవన్ కళ్యాణ్ నాయక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.